లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

బిడ్డకు పాలివ్వడం తల్లి ఆరోగ్యానికి ముఖ్యమే : హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శిశువుల ఆరోగ్య సంరక్షణలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తల్లిపాల ప్రాధాన్యత గురించి వివరించే లోగోను సచివాలయంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లి పాలిస్తే బిడ్డ ఆరోగ్యంతోపాటు ఆ తల్లి ఆరోగ్యానికి కూడా మంచిదని సూచించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సమీక్ష గణాంకాల ప్రకారం శిశువులకు తల్లి పాలు అందించడంలో దేశ సగటు 63 శాతం ఉంటే తెలంగాణ మాత్రం 68 శాతంతో అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. పాలిచ్చే తల్లులకు భవిష్యత్తులో రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత్ సీరమ్స్ అండ్ వ్యాక్సిన్స్ లిమిటెడ్ సి ఓఓ విశ్వనాథ్ స్వరూప్ ,ప్రతినిధులు, ఆరోగ్య శాఖ సెక్రెటరీ రీజ్వి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగా జిఒ 33 విడుదల

- గృహలక్ష్మి పథకంలో వికలాంగులకు రిజర్వేషన్ అమలు
- ఎన్‌పిఆర్‌డి హర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోరాటాల ఫలితంగానే జిఒ నెంబర్ 33ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహలక్ష్మి పథకంలో వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పలు సార్లు మంత్రిని, కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించామని గుర్తు చేశారు.

ఫలితంగానే జిఒ నెంబర్ 25కు సవరణచేసి జిఒ 33ను జారీ వల్ల వికలాంగుల ప్రయోజనాలు కొంత మేరకు నెరవేరుతాయని తెలిపారు. ఈ జిఒ ప్రకారమే లబ్ధిదారుల ఎంపికలో వికలాంగులకు ఐదు శాతం కేటాయిస్తామని ప్రభుత్వం పేర్కొనడం హర్షించదగిందని పేర్కొన్నారు. జిఒ ప్రకారం జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పివిఎన్ఆర్ తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీతో ఎస్‌సిఐఐఎన్‌వి ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఎఎంఆర్) సమస్యలపై సంయుక్త పరిశోధనలు చేసేందుకు వీలుగా పివి నర్సింహారావు తెలంగాణ పశు విశ్వవిద్యాలయం, ఎస్‌సిఐఐఎన్‌వి బయోసైన్సెస్ ప్రయివేట్ లిమిటెడ్ మధ్య ఒప్పందం కుదిరింది.

ఈ మేరకు మంగళవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ రవీందర్ రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జ్ఞాన ప్రకాశ్, ఫ్యాకల్టీ డీన్ డాక్టర్ రఘునందన్, ఎస్‌సిఐఐఎన్‌వి సిఇఒ డాక్టర్ ఏకాంబరం సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలను చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ సిఎఐ అధ్యక్షులు డాక్టర్ బుర్రి రంగారెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మణ్, డాక్టర్ రత్నాకర్ పాల్గొన్నారు. ఉన్నత లక్ష్యం కోసం వారంతా ప్రతిజ్ఞ చేశారు.

దేశ సుస్థిరత నేటి అవసరం

- సిఎస్ఐఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ కళైసెల్వీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశానికి సుస్థిరత అనేది నేటి తక్షణావసరమని సిఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ కళైసెల్వీ తెలిపారు. మంగళవారం కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ దేశవ్యాప్తంగా వన్ వీక్-వన్ ల్యాబ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా కళైసెల్వీ హైదరాబాద్‌లోని సీసీఎంబీలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెల్వీ మాట్లాడుతూ సుస్థిరత కోసం భిన్నమైన ల్యాబులు, శాస్త్రవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, పరిశ్రమ సమిష్టి కృషి అవసరమని అభిప్రాయపడ్డారు.

కోవిడ్-19 ఇలాంటి అనేక మంది భాగస్వాములను ఒక దగ్గరికి చేర్చిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిసిఎంబి డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి తదితరులు పాల్గొన్నారు.

88 శాతం రూ.2 వేల నోట్లు వెనక్కి

- బ్యాంక్‌లకు చేరాయన్న ఆర్‌బిఐ

ముంబయి : ప్రస్తుత ఏడాది జులై 31 నాటికి 88 శాతం మేర రూ.2,000 నోట్లు బ్యాంక్‌లకు చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వెల్లడించింది. వీటి మొత్తం విలువ రూ.3.14 లక్షల కోట్లుగా ఉంటుందని తెలిపింది. ఇంకా 42వేల కోట్ల విలువైన రూ.2వేల నోట్లు చలామణీలో ఉన్నాయని.. ఆ మొత్తం బ్యాంక్‌లకు చేరలేదని తెలిపింది.

మే 19న ఆర్‌బిఐ రూ.2,000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ నాటికి మొత్తం రూ.3.56 లక్షల కోట్ల విలువ చేసే రూ.2,000 నోట్లు మార్కెట్‌లో ఉన్నాయి. వీటి మార్పిడికి సెప్టెంబర్ 30 వరకు ఆర్‌బిఐ గడువు ఇచ్చింది. ఇప్పటి వరకు వెనక్కి వచ్చిన మొత్తం నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలోనే వచ్చాయని ఆర్‌బిఐ తెలిపింది. మిగితా 13 శాతం మాత్రమే వేరే నోట్లతో మార్పిడి చేసుకున్నారు. ఈ రెండు నెలల్లోనే మిగితా నోట్లను మార్చుకోవాలని ఆర్‌బిఐ ప్రజలకు సూచించింది.

పెట్టుబడిదారీ సమాజంలో ప్రతిదీ 'సరుకీకరణ'

- బంధాలు, అనుబంధాలు సైతం అదే దారిలో
- మతోన్మాద, అధిపత్యభావాలపై యుద్ధం చేయాలి
- నవతెలంగాణ 8వ వార్షికోత్సవంలో తమ్మినేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పెట్టుబడిదారీ సమాజం వేగంగా విస్తరిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆందోళన వ్యక్తం చేశారు. కొంత మంది వ్యక్తుల వద్ద విపరీతమైన సంపద పోగవుతోందని, దాని చుట్టే వ్యవస్థలు తిరుగుతున్నాయని చెప్పారు. అందుకే పెట్టుబడిదారీ సమాజంలో ప్రతిదీ సరుకుగా మారుతూ... చివరకు అనుబంధాలు, బంధాలు, కుటుంబం వ్యవస్థ, స్నేహాలు 'సరుకీకరణ'గా రూపాంతం చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాద, అధిపత్య భావజాలానికి వ్యతిరేకరంగా ప్రత్యామ్నాయ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన కర్తవ్యం నవతెలంగాణపై ఉందని నొక్కి చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంహెచ్ భవన్‌లో 'నవతెలంగాణ 8వ వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. మతోన్మాదంతో ముందుకు పోతున్న బిజెపి రాజకీయ ప్రత్యర్థి అనీ, 2024 ఎన్నికల్లో ఆ పార్టీ ఓడించాలని పిలుపునిచ్చారు. మతోన్మాద భావజాల శక్తిగా, సమాజాన్ని తిరోగమన దిశలోకి తీసుకెళ్లుతున్న శక్తిని అడ్డుకోవాల్సిన అవసరముందని చెప్పారు. ఆచారాలు, సంప్రదాయాలు, సినిమాలు, కథలు, కళలల్లోకి ప్రమాదకరంగా తొంగి చూస్తున్నదని తెలిపారు. అటువంటి అంశాలను శోధించి బయటకు తీసి ఎండగట్టాలని కోరారు. రాజకీయ, సామాజిక విద్యా, కళారంగాలు, ఆర్థిక రంగాల్లో నెలకొన్న భావజాలాన్ని తొలగించాలన్నారు.

రాష్ట్రంలో బిజెపి గ్రాఫ్ పడిపోతోందని తమ్మినేని చెప్పారు. ఆ పార్టీ నేతలు ఎవరి దారి వాళ్లు చూసుకుంటున్నారని వివరించారు. రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే పోటీ ఉంటుందని అభిప్రాయపడ్డారు. బిఆర్ఎస్ బిజెపికి వ్యతిరేకంగా పోరాడుతోందని తెలిపారు. కమలం పార్టీకి వ్యతిరేకంగా

ఉన్న పార్టీలు మతోన్మాదానికి వ్యతిరేకంగా నిలబడ్డాయనుకుంటే పొరపాటేనన్నారు. తమ రాజకీయ అవసరాలకు ఆ పార్టీని ఉపయోగించుకుంటున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో బిజెపి తిరోగమన చర్యల్ని, దుర్మార్గాలను అడ్డుకునేందుకు వచ్చే ఎన్నికల్లో ఆపార్టీని ఓడించాలని కోరారు.

పత్రికా, మీడియా వ్యాపారమయమైంది : పి ప్రభాకర్

కొందరు మీడియాను అడ్డంపెట్టుకుని ఆస్తులు, పదవులు అనుభవిస్తున్నారని, వ్యాపారంగా మార్చేశారని నవతెలంగాణ సీజీఎం పి ప్రభాకర్ చెప్పారు. తమకు ఇష్టమైన పార్టీలను అధికారంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. పేదలు, కార్మికులు, రైతులు, మధ్యతరగతి వర్గాల సమస్యలపై 'నవతెలంగాణ'లో నిష్పక్షపాతంగా వార్తలు రాస్తున్నామని తెలిపారు. ఎన్నో నిర్బంధాలతోపాటు కరోనాను సైతం ఎదుర్కొని నవతెలంగాణ నిలబడిందని గుర్తు చేశారు. నవతెలంగాణ కోసం స్వచ్ఛందంగా ఎంతో మంది కాలమిస్టులు, రచయితలు, కవులు రాస్తున్నారనీ వారికి, సిద్ధాంతాలు, రాజకీయ నిబద్ధతతో పని చేస్తున్న సిబ్బందికి అభినందనలు తెలిపారు.

మానవవాదాన్ని సృష్టించాలి : దేవరాజు మహారాజు

సైంటిఫిక్ టెంపర్‌కు సంబంధించిన అంశాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటర్నెట్, ఫోలోగ్రామ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ (ఏఐ) వేగంగా విస్తరిస్తున్న క్రమంలో ఈ సమాజాన్ని మూడువేల ఏండ్ల వెనక్కితీసుకపోతామంటే ఊరుకున్నే సమస్యేలేదన్నారు. ప్రస్తుతం ఆలోచనాపరమైన దృక్పథాన్ని మార్చేందుకు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు.

నిజాలను నిర్భయంగా చెప్పాలి : తెలకపల్లి రవి

మతోన్మాద భావజాలంపై నిజాలను నిర్భయంగా రాయాలని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ప్రజాశక్తి మాజీ సంపాదకులు తెలకపల్లి రవి సూచించారు. దానిపై విస్తృతమైన ఉద్యమాలు సాగించాలన్నారు. ఎరుపుదనం తగ్గకుండా ఆశయాలకనుగుణంగా పని చేయాలని సూచించారు. ఎన్నో బాలారిష్టాలను అధిగమించి పత్రిక ముందుకు సాగుతోందని తెలిపారు. మఫిసిల్ రాష్ట్ర ఇంచార్జి గుత్తా వేణుమాధవరావు అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం, కాలమిస్టులు ఎం కోటేశ్వరరావు, ఉషాకిరణ్, బోడపట్ల రవీందర్, సుధామ, పి జ్యోతి, కూర చిదంబరం, పొన్నం రవిచంద్ర తదితరులకు శాలువా కప్పి, మెమెంటో ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో బుక్‌హౌస్ ఎడిటర్ కె ఆనందాచారి, ఇంచార్జి ఎడిటర్ రాంపల్లి రమేష్, 10 టివి మాజీ ఎండి కె వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

సెప్టెంబర్ 15న టెట్

- 27న ఫలితాలు విడుదల
- నేటినుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- వాటి సమర్పణకు తుది గడువు 16
- నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ మంగళవారం విడుదల చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్‌పర్సన్ శ్రీదేవసేన, ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్, టెట్ కన్వీనర్ రాధారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు తుది గడువు ఈనెల 16 వరకు ఉందని స్పష్టం చేశారు. టెట్ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. సెప్టెంబర్ 15న టెట్ రాతపరీక్షను రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లోనూ నిర్వహిస్తామని వివరించారు. అదేరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్-2 రాతపరీక్షలుంటాయని తెలిపారు. అదేనెల తొమ్మిది నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. 27న ఫలితాలను విడుదల చేస్తామని పేర్కొన్నారు. 150 మార్కులకు రాతపరీక్ష ఉంటుందనీ, జనరల్ అభ్యర్థులు 60 శాతం (90 మార్కులు), బిసిలు 50 శాతం (75 మార్కులు), ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులు 40 శాతం (60 మార్కులు) సాధించాలని తెలిపారు. ఉపాధ్యాయ నియామక పరీక్ష (టిఆర్‌టి)లో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుందని స్పష్టం చేశారు. అయితే టెట్ దరఖాస్తు ఫీజును విద్యాశాఖ రెట్టింపు చేసింది. రూ.200 ఉన్న ఫీజును రూ.400కు పెంచింది. బుధవారం నుంచి ఈనెల 16 వరకు ఫీజు చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో మరోసారి టెట్‌ను నిర్వహించాలని విద్యాశాఖ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే టెట్ నోటిఫికేషన్‌ను విద్యాశాఖ విడుదల చేసింది. ఇతర వివరాలకు https://tstet.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

హిజ్బుత్ తహ్రీర్ కేసులో మరో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హిజ్బుత్ తహ్రీర్ కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అధికారులు మరొకరిని అరెస్టు చేశారు. రెండు నెలలుగా తప్పించుకొని తిరగుతున్న సల్మాన్‌ను ఎన్ఐఎ అధికారులు మంగళవారం రాజేంద్రనగర్‌లో అరెస్టు చేశారు. పక్కా సమాచారం మేరకు రెండు చోట్ల తనిఖీ చేసిన ఎన్ఐఎ అధికారులు హార్డ్ డిస్క్‌లు, పెన్ డ్రైవ్‌లు, ఎస్‌డి కార్డులతోపాటు తీవ్రవాదానికి సంబంధించిన పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ ఇస్లామిక్ రాడికల్స్ సంస్థ అయిన హిజ్బుత్ తహ్రీర్.. భోపాల్, హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు విస్తరించేందుకు కుట్ర పన్నింది.

ఈ మేరకు నిఘా పెట్టిన ఐబి అధికారులు భోపాల్ ఎటిఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. మే 24న భోపాల్‌తోపాటు హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించిన ఎటిఎస్ అధికారులు 16 మందిని అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో సలీంతోపాటు మరో నలుగురిని అరెస్టు చేశారు. అదే రోజు సల్మాన్ ఇంటికి వెళ్లినప్పటికీ.. ఎటిఎస్ దాడులను గ్రహించిన నిందితుడు అంతకుముందే తప్పించుకున్నాడు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన ఎన్ఐఎ అధికారులు పరారీలో ఉన్న సల్మాన్ కోసం నిఘాపెట్టి అరెస్టు చేశారు. సల్మాన్‌ను ప్రశ్నిస్తే హైదరాబాద్‌లో హిజ్బుత్ తహ్రీర్ కార్యకలాపాలకు సంబంధించి మరింత సమాచారం వచ్చే అవకాశం ఉందని జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు భావిస్తున్నారు.

వరద నష్టాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

- వివరించిన హన్మకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు, కమిషనర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరంగల్ మహ నగరపాలక సంస్థ పరిధిలో వరద నష్టాన్ని అంతర్ మంత్రిత్వ శాఖ కేంద్ర బృందం మంగళవారం పరిశీలించింది. ఏడుగురు సభ్యుల కేంద్ర బృందంలో ఎన్‌డిఎంఎ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి (టీం లీడర్), డిప్యూటీ సెక్రటరీ అనిల్ గైరోల్, రీజినల్ ఆఫీసర్ కుష్వా, మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి డైరెక్టర్ రమేష్ కుమార్, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ పూను స్వామి, హైదరాబాద్ ఎన్ఆర్ఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసులు, పవర్ భవ్య పాండే ఉన్నారు. ఈ బృందం గ్రేటర్ వరంగల్‌లో దెబ్బతిన్న ఇళ్లు, రహదారులతో పాటు దెబ్బతిన్న పంటలు, వివిధ శాఖలకు జరిగిన నష్టాన్ని పరిశీలించారు. ముందుగా హన్మకొండ కలెక్టరేట్‌లో హన్మకొండ, వరంగల్ జిల్లాల్లో, వరంగల్ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వరద ప్రభావిత ప్రాంతాలకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం వరదలతో దెబ్బతిన్న, నష్టపోయిన వివరాలను కేంద్ర పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా హన్మకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా కేంద్ర బృందానికి వివరించారు.

ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం, కలెకర్టర్లు, కమిషనర్

వరంగల్ నగరంలో జులై 18 నుంచి 27 వరకు 600 ఎంఎం వర్షపాతం నమోదయిందని కమిషనర్ తెలిపారు. దెబ్బతిన్న 150.61 కి.మీ సిసి రోడ్డుకు రూ110.71 కోట్లు, 82.73 కి.మీ బీటీ రోడ్డుకు రూ.92.94 కోట్లు, 84.56 కి.మీ మెటల్ రోడ్డుకు రూ.43.55 కోట్లు, 75.23 కి.మీ గ్రావెల్ రోడ్డుకు రూ.9.37 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. అలాగే, 128 కి.మీ మురుగు కాలువలకు రూ.63.9 కోట్లు, 71 కల్వర్టులకు రూ.52.41 కోట్లు, 41.3 కి.మీ మంచినీటి పైప్‌లైన్‌లకు రూ.25 కోట్లు నష్టం జరిగిందని వివరించారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌కు.. 535 కంప్లైంట్స్ రాగా ఐదు రెస్పాన్స్ బృందల ద్వారా వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని, నగరంలో 199 కాలనీలు పాక్షికంగా నీటిలో మునగగా క్లియర్ చేసినట్టు తెలిపారు. పడిపోయిన 32 వృక్షాలను తొలగించామన్నారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ద్వారా 27 ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి దాదాపు 3500 వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు వారికి భోజన సదుపాయం కల్పించినట్టు తెలిపారు. అనంతరం కేంద్ర బృందం కలెక్టర్లు కమిషనర్, అధికారులతో కలిసి గ్రేటర్ వరంగల్ పరిధిలోని జవహర్ నగర్, పోతననగర్ ప్రాంతంలో భద్రకాళి బండ్ చెరువుకు గండిపడిన ప్రాంతాన్ని, బొంది వాగు ప్రాంతాన్ని పరిశీలించారు. కేంద్ర బృందంతో అడిషనల్ కలెక్టర్ జి మహేందర్, నీటి పారుదల శాఖ మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ ఆర్ అండ్ బి సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వంలో ఆర్టీసి విలీనం పట్ల సిపిఎం హర్షం

- ఇది రాజకీయ ప్రకటనగా మిగిలిపోవద్దని సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వంలో ఆర్‌టిసిని విలీనం చేస్తున్నట్టు రాష్ట్ర క్యాబినెట్ చేసిన నిర్ణయాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ స్వాగతించింది. మెట్రో రైల్ విస్తరణ, అనాథ పిల్లల సంరక్షణకు ఆర్ఫన్ పాలసీ, వరంగల్ విమానాశ్రయం, హకీంపేట్ విమానాశ్రయం, మరో ఎనిమిది వైద్య కళాశాలలకు ఆమోదం లాంటి అంశాలన్నీ హర్షించదగ్గవేనని తెలిపింది. అయితే ఆర్‌టిసికి సంబంధించి ఇంకా స్పష్టత రావాల్సి ఉందని పేర్కొంది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1958కి ముందులాగా మొత్తం ఆర్‌టిసిని ప్రభుత్వ శాఖలాగా చేస్తారా లేదా ఆర్‌టిసి ఉద్యోగులను మాత్రమే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారా? అనే అంశంపై స్పష్టత లేదని తెలిపారు. 2017, 2021లో జరగాల్సిన వేతన ఒప్పందాలు 2013 వేతన ఒప్పందంలోని 50 శాతం బకాయి, 160 నెలల డిఎ, బకాయిల చెల్లింపులు వంటి అంశాల ప్రస్తావన ప్రభుత్వ ప్రకటనలో లేదని పేర్కొన్నారు. విలీన ప్రకటన ఒక రాజకీయ ప్రకటనగా మిగిలిపోకుండా ఉండాలంటే కార్మికులకు సంబంధించిన అనేక సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన విధివిధానాలను రూపొందించాలని కోరారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టాలని సూచించారు. అందులో ఇటువంటి అంశాలన్నింటినీ చేర్చి ఉద్యోగులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

వరద బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి

గత పది రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో రాష్ట్రం అతలాకుతలమైందని, జనజీవనం అస్తవ్యస్తమైందని తమ్మినేని తెలిపారు. అనేక జిల్లాల్లో పంటలకు తీవ్రనష్టం జరగడంతోపాటు, ప్రజలు నివసించే వేలాది ఇళ్లు నేలమట్టమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్లు బురదతో కూరుకుపోయాయని పేర్కొన్నారు. తిండి గింజలు, వంట సామాగ్రి సైతం వరదలో కొట్టుకుపోయాయని వివరించారు. రోడ్లు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని తెలిపారు. అనేక గ్రామాలు నీటిలో మునిగిపోయాయని పేర్కొన్నారు. ఎక్కడా అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేయకుండానే వరద నష్టాన్ని అంచనా వేశారని విమర్శించారు. ఈ విపత్కర పరిస్థితుల్లో క్యాబినెట్ కేటాయించిన రూ.500 కోట్లు ఏమాత్రం సరిపోవని తెలిపారు. మరో నాలుగు రెట్లు ఈ సహాయాన్ని పెంచాల్సిన అవసరముందని పేర్కొన్నారు. అంటువ్యాధులూ ప్రబలే అవకాశమున్నందున ఎక్కడికక్కడ వైద్య బృందాలను ఏర్పాటుచేసి, ప్రజలకు తక్షణ వైద్యాన్ని, మందులను అందించాలని డిమాండ్ చేశారు. వరదలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా స్పందించి విపత్తు సహాయ నిధి నుంచి రాష్ట్రానికి నిధులు విడుదల చేయాలని కోరారు. వరద బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సూచించారు.

బంగారం డిమాండ్‌లో పతనం

- అమ్మకాల్లో 7 శాతం పతనం

ముంబయి : అధిక ధరలతో ప్రజల ఆదాయాలు పడిపోవడానికి తోడు హెచ్చు బంగారం ధరల నేపథ్యంలో దేశంలో పసిడికి డిమాండ్ తగ్గింది. ముఖ్యంగా రికార్డ్ స్థాయికి చేరిన పసిడి ధరలు అమ్మకాలను దెబ్బతీస్తున్నాయి. వాల్డ్ గోల్డ్ కౌన్సిల్ రిపోర్ట్ ప్రకారం.. ప్రస్తుత ఏడాది ఏప్రిల్ - జూన్ త్రైమాసికంలో భారత్‌లో బంగారం అమ్మకాలు 7 శాతం పతనమై 158.1 టన్నులకు తగ్గాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో 170.7 టన్నుల డిమాండ్ చోటు చేసుకుంది. ఇటీవల ఆర్‌బిఐ రూ.2వేల నోట్లను ఉపసంహరించుకోవడం కూడా పసిడి అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపిందని డబ్ల్యుజిసి పేర్కొంది. ఈ ఏడాది తొలి ఆరు నెలల కాలంలో బంగారం డిమాండ్ 271 టన్నులుగా అంచనా వేసింది. 2023 సంవత్సరంలో మొత్తంగా డిమాండ్ 650 నుంచి 750 టన్నుల మధ్య వరకు ఉండొచ్చని తెలిపింది. ప్రపంచంలో అత్యధికంగా బంగారం వినియోగించే దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉంది. మంగళవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.160 పెరిగి రూ.60,440గా నమోదయ్యింది. 22 క్యారెట్ల ధర రూ.150 పెరిగి రూ.55,400గా పలికింది. కిలో వెండిపై రూ.1000 పెరిగి రూ.81వేలుగా నమోదయ్యింది.

NOTICE
In The Court Of The Senior Civil Judge :: Tadepalligudem
A.S.No. 3/2011

Between:
1) Edupalli Rama Rao (Died)
2) Edupalli Srikanth ...Appellants
AND
1) Edupalli Atchyuta Ramayya (Died)
2) Edupalli Durga Rao and Others ...Respondents

TO: Respondents No. 6:
6) Yadla Jyothi, W/o. Ravikumar, Age 59, Hindu, Female, Husband's Protection, D.No. 1-2-26, Plot No. 204, Sai Vishnu Apartments, Domalaguda, Ganganmahal, Road No.6, Hyderabad City Civil Courts.

Please take notice that the above A.S. is filed by the appellants against the respondents. The matter is posted for the appearance of the above **6th Respondents on Dt. 11-08-2023 from 10:30 A.M. onwards,** on which day you may appear in person or through your advocate and file your objections /pleadings if any. Otherwise the matter will be adjucate according to law in your absence.

G.SYAMA PRASAD MUKHERJEE
N.SURYA MANI
Advocates, Tadepalligudem.
Tadepalligudem, 31-7-23.

NOTICE
In The Court Of The Senior Civil Judge :: Tadepalligudem
I.A.No. 709/2021, A.S.No. 3/2011

Between:
1) Edupalli Rama Rao (Died)
2) Edupalli Srikanth ...Appellants
AND
1) Edupalli Atchyuta Ramayya (Died)
2) Edupalli Durga Rao and Others ...Respondents

TO: Respondents No. 6:
6) Yadla Jyothi, W/o. Ravikumar, Age 59, Hindu, Female, Husband's Protection, D.No. 1-2-26, Plot No. 204, Sai Vishnu Apartments, Domalaguda, Ganganmahal, Road No.6, Hyderabad City Civil Courts.

Please take notice that the above A.S. is filed by the appellants against the respondents. The matter is posted for the appearance of the above **6th Respondents on Dt. 11-08-2023 from 10:30 A.M. onwards,** on which day you may appear in person or through your advocate and file your objections /pleadings if any. Otherwise the matter will be adjucate according to law in your absence.

G.SYAMA PRASAD MUKHERJEE
N.SURYA MANI
Advocates, Tadepalligudem.
Tadepalligudem, 31-7-23.

మహారాజశ్రీ జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, జంగారెడ్డిగూడెం
ఐ.ఎ.నెం.388/2023, ఓ.ఎస్.నెం.126/2022

మధ్య:
శ్రీమతి కాళింగి భద్రకాళి ...వాది
మరియు
శ్రీ ధర్మాలకోట దుర్గా శంకర్ వగైరాలు ...ప్రతివాదులు

టు: ప్రతివాదులు:
1) శ్రీ ధర్మాలకోట దుర్గా శంకర్, H/o. లేటు నెక్కింటి పుష్పలత, హిందూ, పు॥, వ॥58 సం॥లు, హైస్కూలు దగ్గర, ఆశ్వారావుపేట రోడ్డు, జంగారెడ్డిగూడెం (V&M), ఏలూరు జిల్లా.
2) శ్రీమతి వలసపల్లి అఖిల @ ధర్మాలకోట అఖిల, భర్త: జగదీష్, స్త్రీ, వ॥ 32 సం॥లు, నాచారం గ్రామం, పోస్టు, దమ్మపేట మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
3) శ్రీ ధర్మాలకోట నిఖిల్, తండ్రి: దుర్గా శంకర్, పు॥, వ॥35 సం॥లు, హైస్కూలు దగ్గర, ఆశ్వారావుపేట రోడ్డు, జంగారెడ్డిగూడెం (V&M), ఏలూరు జిల్లా.

ఈ నంబరు దావాలో శ్రీ కోర్టు వారు మీకు దావా సమన్లును రిజిష్టరు పోస్టు ద్వారాను, కోర్టు వారి ద్వారాను, ఎన్నిమార్లు పంపించినను మీరు బుద్ధిపూర్వకంగా తీసుకోకుండా Avoid చేయుచున్నందున తేది **29-08-2023** సమయం **10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా మీ తరపు న్యాయవాది వారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

మోదేపల్లి నాగులు
అడ్వకేట్, జంగారెడ్డిగూడెం.
సెల్: 96407 19598
జంగారెడ్డిగూడెం.
01-08-2023.

మహారాజశ్రీ భీమునిపట్నం ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 1147/2022 O.S. 468/2022

బిట్వీన్:
బొట్టా సోమునాయుడు ... వాది
అండ్:
బొట్టా అప్పారావు & ఇతరులు ... ప్రతివాదులు

నోటీసు

టు:
డి-3: యెట్టాపు శ్రీధర్ రెడ్డి,
తండ్రి వెంకటపతిరెడ్డి, ఫ్లాట్‌నెం. 803, ఎ-బ్లాక్ మీనాక్షిట్రైడెంట్ టవర్స్, నియర్ రాంకిటవర్స్, గచ్చిబౌలి, శేర్‌లింగంపల్లి, కె.వి.రంగారెడ్డి జిల్లా, తెలంగాణ

పై నెంబరు దావాని బొట్టా సోమునాయుడు దావా ఆస్థి పంపకం కొరకు వేసియున్నారు. ఈ దావాలో కోర్టు నోటీసు ఎన్నిమార్లు పంపినా మీరు అందుకోనందున కోర్టు వారి ఆర్డరు మేరకు ఈ ప్రకటన చేయడమైనది. వాయిదా **21-9-2023న** అయివున్నది. ఆరోజున మీరు స్వయముగా గాని, లేదా వకీలుగారి ద్వారా గాని కోర్టుకు **ఉదయం 10-30 ని॥లకు** హాజరయి ఈ కేసులో, మీ సమాధానము తెలియపరచవలసినదిగాను అట్లు మీరు హాజరుకాని యెడల కేసులో మీకు వ్యతిరేకముగా Exparte Order పాస్ చేయుదురని తెలియజేయడమైనది.

వాయిదా తేది: 21-09-2023
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

V.V.RAMANA PRASAD
Advocate, # 14-142, Venkatadri, Sarada Nagar, Opp. Ratithu Bazar, Pendurthi Visakhpatnam-531 173
Celll : 93466 50651
పెందుర్తి
తే:01-08-23

మహారాజశ్రీ భీమునిపట్నం ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 468/2022

బిట్వీన్:
బొట్టా సోమునాయుడు ... వాది
అండ్:
బొట్టా అప్పారావు & ఇతరులు ... ప్రతివాదులు

నోటీసు

టు:
డి-3: యెట్టాపు శ్రీధర్ రెడ్డి,
తండ్రి వెంకటపతిరెడ్డి, ఫ్లాట్‌నెం. 803, ఎ-బ్లాక్ మీనాక్షిట్రైడెంట్ టవర్స్, నియర్ రాంకిటవర్స్, గచ్చిబౌలి, శేర్‌లింగంపల్లి, కె.వి.రంగారెడ్డి జిల్లా, తెలంగాణ

పై నెంబరు దావాని బొట్టా సోమునాయుడు దావా ఆస్థి పంపకం కొరకు వేసియున్నారు. ఈ దావాలో కోర్టు నోటీసు ఎన్నిమార్లు పంపినా మీరు అందుకోనందున కోర్టు వారి ఆర్డరు మేరకు ఈ ప్రకటన చేయడమైనది. వాయిదా **21-9-2023న** అయివున్నది. ఆరోజున మీరు స్వయముగా గాని, లేదా వకీలుగారి ద్వారా గాని కోర్టుకు **ఉదయం 10-30 ని॥లకు** హాజరయి ఈ కేసులో, మీ సమాధానము తెలియపరచవలసినదిగాను అట్లు మీరు హాజరుకాని యెడల కేసులో మీకు వ్యతిరేకముగా Exparte Order పాస్ చేయుదురని తెలియజేయడమైనది.

వాయిదా తేది: 21-09-2023
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

V.V.RAMANA PRASAD
Advocate, # 14-142, Venkatadri, Sarada Nagar, Opp. Ratithu Bazar, Pendurthi Visakhpatnam-531 173
Celll : 93466 50651
పెందుర్తి
తే:01-08-23

‘ఎస్‌ఎఫ్‌ఐ’ రాజ్‌భవన్ ముట్టడి ఉద్రిక్తం

- మూర్తి, నాగరాజు సహా పలువురిని అరెస్టు చేసిన పోలీసులు
- ఎన్‌ఇపిని రద్దు చేయాలని నాయకుల డిమాండ్
- ఫెడరల్ వ్యవస్థలో గవర్నర్ల జోక్యాన్ని తగ్గించాలి
- విభజన హామీలను కేంద్రం అమలు చేయాలి
- అక్రమ అరెస్టులకు ఖండన
- నేడు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపు

ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను అడ్డుకొని అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన జాతీయ విద్యావిధానం (ఎన్‌ఇపి-2020) రద్దు చేయాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. రాజ్‌భవన్ లోపలికి వెళ్లేందుకు ఆ సంఘం నాయకులు యత్నించారు. ప్లకార్డులు ప్రదర్శించి ‘ఎన్‌ఇపిని రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వ విధానాలు నశించాలి’ అంటూ నినాదాలు చేశారు. అప్పటికే పెద్దఎత్తున మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఆ సంఘం నాయకులు, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. దొరికిన వారిని దొరికినట్టుగానే ఈడ్చుకుంటూ తీసుకెళ్లి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు, ఉపాధ్యక్షులు తాటికొండ రవి, సంతోష్ రాథోడ్, కె ప్రశాంత్, సహాయ కార్యదర్శులు కె అశోక్‌రెడ్డి, బి శంకర్, కేంద్ర కమిటీ సభ్యురాలు ఎం మమత సహా పలువురు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మూర్తి, నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రాలతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండానే కరోనా సమయంలో పార్లమెంటులో బిల్లు పెట్టి చర్చ లేకుండానే ఆమోదించిన ఎన్‌ఇపిని తక్షణమే రద్దు చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌ఇపి అమల్లోకి వస్తే ప్రభుత్వ విద్యారంగం మరింత సంక్షోభంలోకి వెళ్తుందని, కార్పొరేట్, ప్రయివేటు విద్యారంగం మరింత బలోపేతమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా విద్యారంగం మరింత వ్యాపారంగా మారుతుందన్నారు. ఇంకోవైపు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఎన్‌ఇపిలో ప్రాథమిక స్థాయిలోనే ఫౌండేషన్ కోర్సు పేరుతో అంగన్‌వాడీ వ్యవస్థను రద్దు చేసి విద్యను కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి తీసుకెళ్లే కుట్ర చేసిందని విమర్శించారు. పాఠశాల విద్యకు సంబంధించి చదువు మధ్యలో మానేసి వృత్తివిద్యాకోర్సులను తీసుకోవచ్చనే నిబంధనతో డ్రాపౌట్లు పెరుగుతారని చెప్పారు. ఎన్నైనా ప్రయివేట్ వర్సిటీలను ఏర్పాటు చేసుకోవచ్చనే నిర్ణయంతో విద్య మరింత ప్రయివేటుపరం అవుతుందని విమర్శించారు. విదేశీ వర్సిటీలు రావడం వల్ల ఫీజులు భారీగా పెరుగుతాయని, సామాజిక న్యాయం, రిజర్వేషన్లు లేకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతారని అన్నారు. విభజన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యాసంస్థలను మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర విద్యార్థులకు ఫెలోషిప్‌లను విడుదల చేయాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాలో భాగంగా సిలబస్‌లో మార్పులు చేసి చరిత్రను వక్రీకరిస్తున్నదని విమర్శించారు. ఎన్‌ఇపికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని డిమాండ్ చేశారు. ఫెడరల్ వ్యవస్థలో గవర్నర్ల జోక్యాన్ని తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లెనిన్, కార్తీక్, కెవై ప్రణయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు రవినాయక్, రమ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

విద్యార్థులపై పోలీసుల దాడి, అక్రమ అరెస్టులను ఖండిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలకు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరింది.

టిపిటిఎల్‌ఎఫ్ ఖండన

ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని టీపీటీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఏ విజయ్‌కుమార్ ఖండించారు. విద్యార్థులకు గొడ్డలిపెట్టుగా ఉన్న ఎన్‌ఈపీని రద్దు చేయాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో అబ్సల్యూట్ బార్బెక్యూస్

ప్రజాశక్తి - హైదరాబాద్

భారతదేశంలోని ప్రముఖ బార్బెక్యూ అండ్ గ్రిల్ బఫే రెస్టారెంట్‌ల గొలుసుకట్టు రెస్టారెంట్ల సంస్థ అబ్సల్యూట్ బార్బెక్యూస్ హైదరాబాద్‌లో 13 ఔట్‌లెట్‌లకు విస్తరించినట్లు ప్రకటించింది. అత్తాపూర్‌లో నూతన సెంటర్‌ను ప్రారంభించడం ద్వారా.. దేశంలోనూ 60వ అవుట్‌లెట్ మైలురాయికి చేరినట్లు వెల్లడించింది. ఆహ్లాదకరమైన వంటకాల విస్తృత శ్రేణికి పేరుగాంచిన, అబ్సల్యూట్ బార్బెక్యూస్ 75కి పైగా విభిన్నమైన రుచులతో కస్టమర్లకు నోరూరించే వంటకాలను అందిస్తుందని ఆ సంస్థ ఎపి, టిఎస్ మేనేజర్ రామ్ రాజన్ చంద్ర తెలిపారు.

బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ కుటుంబమే బాగుపడింది

- కాంగ్రెస్ జాతీయ మహిళా అధ్యక్షురాలు డీసౌజ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ పాలనలో కెసిఆర్ కుటుంబం తప్ప ఎవరికీ ప్రయోజనం జరగలేదని కాంగ్రెస్ జాతీయ మహిళా అధ్యక్షురాలు డీసౌజ అన్నారు. రైతులు, విద్యార్థులు, మహిళలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. లక్ష రూపాయల పంట రుణ మాఫీ ఊసే లేదనీ, ఖాళీగా ఉన్న లక్షల ఉద్యోగాలు భర్తీ చేయలేదన్నారు. కెసిఆర్ మాయమాటలు నమ్మి మరోసారి తెలంగాణ ప్రజలు మోసపోవద్దన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం

- కార్మిక చట్టాల నిర్వీర్యానికి కుట్రలు
- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికులకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో మంగళవారం పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. నేడు సమాజంలో అన్ని పనులనూ యంత్రాలతో చేయడం వల్ల కార్మికులకు పని దొరకడం లేదని తెలిపారు. కార్మికులకు ఉపాధి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పాలకులు పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారని చెప్పారు. ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలుగా మార్చి కార్మికుల శ్రమదోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికుల కుటుంబాలు వీధి నపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం శ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కేంద్రంలో ఉన్న మోడీ సర్కార్ కార్పొరేట్ల కోసం పనిచేస్తోందని, పేదలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేసి హక్కులను కాలరా స్తోందన్నారు. కార్మిక చట్టాలు లేకుండా చేసేందుకు ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని చెప్పారు.ల

ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో బిజెపి రాజకీయ లబ్ధి కోసం ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలను గుర్తించి అప్రమత్త తతో ఉండాలని కార్మికులకు సూచించారు. ప్రతి కార్మికునికీ విద్య వైద్యం ఉచితంగా అందించడంతో పాటు ఉపాధి కల్పించి, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పేదలు, కార్మికుల పక్షాన పోరాడే నాయకులను చట్ట సభలకు పంపించాలని పిలుపుని చ్చారు. కార్మికులు ఐక్యంగా ఉండి వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేసి హక్కులను కాపాడుకోవాలన్నారు. కార్మికులకు సిఐటియు అండగా ఉంటుందన్నారు. అనంతరం కార్మికులకు గుర్తిం పు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిఎంనాయుడు, సిపిఎం నాయకులు భావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, వరలక్ష్మి, యూనియన్ అధ్యక్షులు మందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఖనిజ సంపద దోపిడీకే మణిపూర్ అల్లర్లు

- మెయితీల ఆకృత్యాలకు పాలకుల వత్తాసు
- అమిత్‌షా పర్యటన తర్వాత పెరిగిన హింస
- ప్రొఫెసర్ హరగోపాల్

‘మెఫి టేక్స్’ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొ. హరగోపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మణిపూర్‌లో విస్తారంగా ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ వర్గాలకు దోచిపెట్టడానికి సాగుతున్న కుట్ర ఫలితంగానే అక్కడ హింస చెలరేగుతోందని రాజకీయ శాస్త్రవేత్త, హక్కుల ఉద్యమ నేత ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్, ఇండియా (మెఫి) మంగళవారం ఏర్పాటు చేసిన ‘మెఫి టేక్స్’ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందిన మెయితీ తెగ వారిని రెచ్చగొట్టి, వారి ఆకృత్యాలకు కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్నాయని విమర్శించారు. విభజించి పాలించు సిద్ధాంతాన్ని పాటిస్తున్న ప్రభుత్వాలు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తుండటం వల్లే హింస మరింత పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార వర్గాలకు సన్నిహితంగా ఉన్న మెయితీలకు దొడ్డిదారిన ప్రభుత్వ ఆయుధాలు అందుతున్నా స్థానిక పోలీసులు, పారా మిలిటరీ బలగాలు మౌనం పాటిస్తున్నాయని ఆరోపించారు. మూడు వేల నుంచి నాలుగు వేల దాకా తుపాకులను, రెండు నుంచి మూడు లక్షల దాకా బుల్లెట్లను మెయితీలు లూటీ చేస్తే.. తిరిగి స్వాధీనం చేసుకోవాల్సిన భద్రతా దళాలు ఆయుధాలు అప్పజె ప్పండి అంటూ ప్రాధేయపడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటిదాకా మణిపూర్ రాజధాని ఇంఫాలో, పరిసర ప్రాంతాల్లో నివసిస్తూ ప్రభుత్వ కాంట్రాక్టులతో ధనికులుగా మారిన మెయితీలు ఇప్పుడు కొండ ప్రాంతాల్లోని అటవీ సంపదపై కన్నేశారని తెలిపారు. వాస్తవానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మణిపూర్‌లో పర్యటించిన తర్వాతే అక్కడ ఘర్షణలు మరింత ఎక్కువయ్యాయని చెప్పారు. దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలన్న ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యాలను సాధించ డానికి మోడీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గుజరాత్‌లో జరిగిన నరమేధం కానీ, ఇప్పుడు మణిపూర్‌లో జరుగుతున్న దురాఘతాలు కానీ అందులో భాగమేనని చెప్పారు. క్రిస్టియన్‌లైన కుకీలకు చెందిన 300 చర్చీలను మెయితీలు కూల్చేయడం దారుణ మన్నారు. ఈ కార్యక్రమానికి మెఫీ ట్రస్టీ, సీనియర్ జర్నలిస్టు, ఆలపాటి సురేష్ కుమార్ అధ్యక్షత వహించా రు. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) కార్యదర్శి వై నరేందర్ రెడ్డి వందన సమర్పణ చేశారు. మెఫీ మేనేజింగ్ ట్రస్టీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ప్రెస్‌క్లబ్ కోశాధికారి ఎ రాజేష్, పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

నారాయణమ్మ కాలేజీ ‘సైబర్ సురక్ష కార్యక్రమం’

ప్రజాశక్తి - హైదరాబాద్

జి నారాయణమ్మ ఇన్స్‌ట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మహిళా కళాశాల (జిఎన్‌ఐటిఎస్), సిఎస్‌ఐ స్టూడెంట్ చాప్టర్, హైదరాబాద్ సంయుక్తంగా సైబర్ సురక్ష కార్యక్రమం చేపట్టాయి. గ్రామీణ వర్గాల సాధికారత లక్ష్యంగా యాదాద్రి జిల్లా భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఎస్‌ఐ రీసోర్స్ పర్సన్స్, జిఎన్‌ఐటిఎస్ విద్యార్థులు.. సైబర్ భద్రతకు సంబంధించిన అనేక ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సైబర్ భద్రతకు సంబంధించిన ప్రాథమిక విషయాలపై అవగాహన పొందారని ఆ వర్గాలు తెలిపాయి. ఇంటర్నెట్‌ను ఉపయోగిస్తున్నప్పుడు తలెత్తిన సైబర్ నేరాల నుండి తాము ఎలా స్పందించి తమను తాము రక్షించుకోవడానికి సమర్థవంతమైన వ్యూహాలను, మెళు కువలపై అవగాహన కల్పించారు. అదనంగా మెరుగైన డిజిటల్ భద్రత కోసం ప్రభుత్వము రూపొందించిన యాప్ సురక్షిత వినియోగాన్ని కూడా ఈ కార్యక్రమము ద్వారా వివరించారు.

భద్రాచలం వరదకు కరకట్టలు అసాధ్యం

- భూసేకరణతోపాటు భారీ వ్యయం
- నిర్వాసితుల తరలింపునకే ప్రాధాన్యం
- సాంకేతిక అంశాలపై ప్రత్యేకంగా మరో కమిటీ
- నీటిపారుదల శాఖ సమీక్షలో రజత్‌కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భద్రాచలం వరదలతో కరకట్టలు కట్టడం అసాధ్యమని కమిటీ తేల్చిచెప్పింది. భూసేకరణతో పాటు నిర్మాణ వ్యయం అధికమవుతుందని అభిప్రాయపడింది. రెండేళ్ల కిందట వరదలతో కమిటీ వేసిన విషయం అందరికీ తెలిసిందేనని గుర్తు చేసింది. ఈ సంవత్సరం కూడా వరద ప్రభావం కొంతమేర పడింది. దీంతో దీనిపై శాశ్వత పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయమై మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్‌కుమార్ అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీ సమావేశం జరిగింది. దీనికి ఇంజినీర్ ఇన్ ఛీఫ్‌లు సి మురళీధర్, జి అనిల్‌కుమార్, బి హరిరామ్, నాగేంద్రరావుతో పాటు సిఎం ఓఎస్‌డి శ్రీధర్‌రావు దేశ్‌పాండే ఆయా టెరిటోరియల్ చీఫ్ ఇంజినీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రాచలం వరదపై నాగేంద్రరావు నేతృత్వంలోని సబ్‌కమిటీ నివేదికపై చర్చ జరిగింది. భద్రాచలం వరద నివారణకు కరకట్టలు కట్టేకన్నా, నివాస ప్రాంతాలు, నిర్వాసితులను తర చోట్లకు తరలించడమే మేలని కమిటీ సిఫారసు చేసింది. దీనిపై మరింత లోతుగా అధ్యయనం కోసం ఒక సాంకేతిక కమిటీని వేయాలని, ఈ కమిటీ నెలరోజుల్లోపు నివేదిక అందించాలని రజత్‌కుమార్ ఆదేశించారు. కమిటీ తెలుగు రాష్ట్రాతో పాటు బ్రహ్మపుత్ర, గంగానది బేసిన్‌లోని ప్రాంతాలను కూడా పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో తీసుకుంటున్న చర్యలపై అధ్యయనం చేసి తగిన నివేదికను అందించాలని నిర్దేశించారు.

కడెం ప్రాజెక్టుకు అదనపు స్పిల్‌వే

కడెం ప్రాజెక్టు స్పిల్‌వే సామర్థ్యం ఐదు లక్షల క్యూసెక్కులను చేర్చడానికి వీలుగా అదనపు స్పిల్‌వే నిర్మాణంపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని రజత్‌కుమార్ అన్నారు. ప్రస్తుతం 3.82 లక్షల క్యూసెక్కుల వరద వెళ్లేలా స్పిల్‌వే ఉందని, వరద అంతకంటే ఎక్కువగా రావడంమూలంగా సమస్యలు ఉత్పన్నమయ్యాయని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగి 65 ఏండ్లు పూర్తయినా, కొన్ని సమస్యలు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ (డిఎస్‌ఆర్‌పి) సిఫారసులకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. మరోవైపు కడెం ప్రాజెక్టుపై మాజ ఈఎన్సీ, నిపుణుడు రామరాజు సిఫారసులపై కూడా చర్చించారు. ప్రాజెక్టు గేట్లన్నీ పాతవనీ, వాటిని మార్చాలన్నారు. దీంతోపాటు కడెం క్యాచ్‌మెంట్ ఏరియాలో ఆటోమేటిక్ రెయిన్‌గేజ్ స్టేషన్లు పెట్టి, వరద సమాచారాన్ని ముందు పసిగట్టి, గేట్లు ఎత్తివేయాలని సూచించారు. ఆకస్మిక వరదల మూలంగానే కడెం ప్రాజెక్టుకు సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ముందు వరదలను అంచనా వేసి గేట్లు ఎత్తి ఉంచితే, సమస్యలు రావని అభిప్రాయపడ్డారు. అలాగే నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టులో భాగంగా డెసిషన్ సపోర్టు సిస్టమ్‌ను కడెం ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేయాలని తాజాగా నిర్ణయించారు.

రూ. 30 కోట్లతో తాత్కాలిక మరమ్మతులు

రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలతో 590కి పైగా చెరువులకు గండ్లు పడ్డాయని, వీటికి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయడానికి రూ.294 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. అయితే తాత్కాలిక ప్రాతిపదికన మరమ్మతులకు రూ. 30 కోట్లు వ్యయం చేయనున్నట్టు చెప్పారు. రెవెన్యూ శాఖ నుంచి 5073 మంది రెవెన్యూ సహాయకులను లష్కర్లుగా నియమించనున్నట్టు తెలిపారు. వీరేకాక మరో 877 మంది పనిచేస్తున్నారనీ, వారి విద్యార్హతలన్నీ పరిశీలన అనంతరం తగిన నిర్ణయం తీసుకోనున్నట్టు వివరించారు.

ఎస్‌సికెఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దూలం శ్రీనివాస్, బి మధు ఎన్నిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (ఎస్‌సికెఎస్-సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులుగా దూలం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బి మధు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం బి మధు ఒక ప్రకటన విడుదల చేశారు. తమ యూనియన్ రాష్ట్ర ఆరో మహాసభలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జులై 29 నుంచి 31 వరకు జరిగాయని పేర్కొన్నారు. ఆ మహాసభలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పర్మినెంట్, వేతనాల పెంపు, కార్మిక చట్టాలు-వేతన ఒప్పందాల అమలు, కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు వైద్యం, తదితర అంశాలపై ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని తీర్మానం చేశామని తెలిపారు. మహాసభలో మొత్తం 13 తీర్మానాలు చేశామని పేర్కొన్నారు.

ఎస్‌సికెఎస్ నూతన కమిటీ ఇదే..

గౌరవాధ్యక్షులు : మందా నర్సింహారావు
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి : బి మధు
రాష్ట్ర అధ్యక్షులు : దూలం శ్రీనివాస్
ఉపాధ్యక్షులు : జి మహేందర్, ఎ ఓదేలు, ఉపేందర్, సిహెచ్ లక్ష్మీనారాయణ, కె రాజయ్య
కార్యదర్శులు : సిహెచ్ అరవింద్, గద్దల శ్రీనివాస్, వి కుమారస్వామి, సారయ్య, వి కుమారి,
కోశాధికారి : సూరం ఐలయ్య

టెలిఫొటో కెమెరాతో ఒప్పో రెనో10 5జి

హైదరాబాద్ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీదారు ఒప్పో కొత్తగా మార్కెట్లోకి ఒప్పో రెనో10 5జిని విడుదల చేసినట్లు తెలిపింది. దీన్ని పొట్రెయిట్ ఫొటోగ్రఫీకి కొత్త నిర్వచనం ఇచ్చేలా టెలిఫోటో కెమెరాతో డిజైన్ చేసినట్లు ఒప్పో ఇండియా ప్రొడక్ట్ మార్కెటింగ్ లీడ్ కరణ్ దువా తెలిపారు. హైదరాబాద్‌లో ఒప్పో రెనో10 5జిని కరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 8జిబి, 256జిబి ర్యామ్ కలిగిన దీని ధరను 32,999గా నిర్ణయించినట్లు వెల్లడించారు. 64 ఎంపి ఒవి64 అల్ట్రా క్లియర్ మెయిన్ కెమెరా, 32 ఎంపి ఐఎంఎక్స్709 టెలిఫోటో పొట్రాయిట్ కెమెరా, 8ఎంపి కెమెరాలతో సహా సెల్ఫీ కోసం 32 ఎంపి ఒవి32సి అల్ట్రా క్లియర్ కెమెరాతో విడుదల చేశామన్నారు. 5000 ఎంఎహెచ్ బ్యాటరీ కలిగిన ఈ ఫోన్ 47 నిమిషాల్లోనే ఫుల్ ఛార్జింగ్ అవుతుందన్నారు

ప్రభుత్వ వైద్యసేవలను వినియోగించుకోవాలి

- గవర్నర్ తమిళిసై

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సౌకర్యాలున్నా, వాటిని వినియోగించుకోవడా నికి ప్రజలు పెద్దగా ఆసక్తి చూపట్లేదని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. ఆయుష్మాన్ భారత్ స్కీం క్రింద కేంద్ర ప్రభుత్వం కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ కేంద్రాలు నెలకొల్పిన విషయాన్ని ప్రస్తావించారు. రెండు మూడు సార్లు ఈ కేంద్రాలకు వచ్చిన వారు తమ వైద్యాన్ని అక్కడే కొనసాగించుకోవాలని భావించట్లేదనీ, ఈ లోపాన్ని ప్రభుత్వాలే సరిదిద్దాలనీ, ఆ మేరకు ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. ఫౌండేషన్ ఫర్ ఫ్యూచరిస్టిక్ సిటీస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాజ్‌భవన్‌లో ‘మహిళా ఆరోగ్యం’ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందుతున్నదనీ, దీనివల్ల వారి జీవితాల్లో అనేక మార్పులు సంభవిస్తున్నాయ న్నారు. గిరిజన మహిళల్లో ఆరోగ్యం పట్ల మరింత అవగాహన, శ్రద్ధ పెరగాలన్నారు. గర్భం ధరించినప్పటి నుంచి బిడ్డ పుట్టే వరకు, ఆ తర్వాత కూడా పౌష్టికాహారాన్ని గర్భిణికి అందించాలనీ, ఈ మేరకే ప్రభుత్వాల విధానాలు రూపొందాలని చెప్పారు.

భారతీయులకు సదా స్మరణీయులు పింగళి వెంకయ్య

ప్రజాశక్తి - కల్చరల్

దేశ ప్రజలందరూ గర్వపడేలా త్రివర్ణ జాతీయ పతాకంను రూపొందించిన పింగళి వెంకయ్య భారతీయులకు సదా స్మరణీయులు అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ నివాళు లర్పించారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా పింగళి వెంకయ్య సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆచార్య ఇనాక్ పాల్గొని మాట్లాడారు. దేశ స్వాతంత్ర సైనిక ఉద్యోగం వదిలి గాంధీజీ మార్గంలో జాతీయ ఉద్యమాలలో వెంకయ్య పాల్గొన్నారన్నారు. గాంధీజీ సూచన మేరకు త్రివర్ణ పతాకం రూపొందించారని వివరించారు. స్వాతంత్ర్య వచ్చిన పిమ్మట ఈ పదవులు బిరుదులు ఆశించని నిస్వార్థ దేశ ప్రేమికుడు వెంకయ్య అని కొనియాడారు.. వంశీ సంస్థల అధినేత వంశీ రామ రాజు మాట్లాడుతూ పింగళి వెంకయ్య స్వాతంత్ర సమర యోధుడే కాక సైనికునిగా ఉపాధ్యాయులుగా పరిశోధకులుగా ప్రసిద్ధులన్నారు. చివరి రోజుల్లో ఆర్థికంగా ఇబ్బంది పడినా విలువలకే కట్టుబడి ఉన్నారని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ వెంకయ్యకు దేశం కానీ రాష్ట్ర ప్రభుత్వాలు కానీ తగిన గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేదికపై కవి తంగిరాల చక్రవర్తి, సూరి భగవంతం ట్రస్టీ ఎస్‌బి రాం, అపర్ణ పాల్గొన్నారు.

కండ్లకలకపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- అధికారులకు మంత్రి హరీశ్ రావు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కండ్లకలక కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలకు ఆ వ్యాధి రాకండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాప్తి నివారణా చర్యలు, చికిత్స తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. సచివాలయంలో జిల్లా వైద్యాధికారులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కండ్లకలక, ఇతర సీజనల్ వ్యాధుల పట్ల తమ వైద్యారోగ్యశాఖ అప్రమత్తంగా ఉందని తెలిపారు. కండ్లకలక విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ తరహా ఇన్ఫెక్షన్ కారణంగా ప్రమాదకర పరిస్థితులేమి ఏర్పడవని స్పష్టం చేశారు. సరోజినీ దేవి కంటి ఆస్పత్రి వేళలు పెంచాలని ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజలింగంను మంత్రి ఆదేశించారు.

తెలుగులోనూ.... ఎఎన్‌ఎం పరీక్ష

ఎంపిహెచ్ఎ ఫిమేల్ (ఎఎన్‌ఎం) పరీక్ష నిర్వహణ విషయంలో ఎఎన్‌ఎంల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వారి కోరిక మేరకు పరీక్షను ఇంగ్లీష్‌తోపాటు, తెలుగులోనూ నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వారికి ఉచితంగా శిక్షణ ఇప్పించాలనీ, అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేయాలని ఆదేశించారు. దీర్ఘకాలికంగా పనిచేస్తున్న వారికి తగిన వెయిటేజ్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీని ఆదేశించారు.

కవులు, కళాకారులు పరిశుద్ధ ఆత్మ కలవారు

- ఆచార్య కొలకలూరి ఇనాక్

ప్రజాశక్తి - కల్చరల్

కవులు కళాకారులు పరిశుద్ధ ఆత్మకలవారని, వారే సమాజానికి దిశానిర్దేశం చేయగలవారని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శ్రీత్యాగరాయ గాన సభలోని కళా దిక్షితులు కళా వేదికపై ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ నిర్వహణలో డాక్టర్ ఆలూరి విల్సన్ జన్మ దిన సందర్భంగా కవిసమ్మేళనం నృత్య సంగీత కార్యక్రమాలు పది ఘంటాలు నిరాటకం జరిగాయి. ముఖ్య అతిధిగా ఆచార్య ఇనాక్ పాల్గొని మాట్లాడుతూ పుట్టిన రోజును పబ్‌లు క్లబ్‌లోనో కాక కళాకారుల కవుల మధ్యన విల్సన్ జరుపుకోవటం అభినందనీయన్నారు. సాహిత్యం సమాజ ప్రగతికి మానవాళి అభ్యుదయానికి దోహదపడుతుందన్నారు. నారాయణ స్వామి వ్యాఖ్యానంలో ఇనాక్‌కు దాశరధి స్మారక పురస్కారం, హాస్య అవధాని శంకరనారాయణకు సినారె స్మారక పురస్కరం, గాయని ఇందిరకు వాణీ జయరాం స్మారక పురస్కారం, కవి డాక్టర్ వడ్డేపల్లి కృష్ణకు లలిత సంగీత గీతాచార్య పురస్కారం నటుడు మాణిక్యకు గుర్రం జాషువా పురస్కారం అంజనీకుమారికి సావిత్రి బాయి పూలే స్మారక పురస్కారం, సినీ నిర్మాత చౌదరికి రామా నాయుడు స్మారక పురస్కారంతో పాటు పలువురు కవులు కళాకారులకు పురస్కారాలు బహుకరించారు.

ఆదివాసీలకు మద్దతుగా కాంగ్రెస్‌పోరాటం

- పిసిసి ఎస్‌టి సెల్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదివాసీల హక్కులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని టిపిసిసి ఎస్‌టి సెల్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.మణిపూర్ ఆదివాసీలకు అండగా ఈ నెల మూడున ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టబోతున్నామన్నారు. ఆగస్ట్ తొమ్మిదిన ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీలకు మద్దతుగా దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపడుతున్నట్లు ఆగస్ట్ ఆరున ఆదివాసీ తండాల్లో బస చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందన్నారు. ఏడున అన్ని జిల్లా కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి,8న సాయంత్రం కాగడాల ప్రదర్శన చేస్తామని పేర్కొన్నారు. తొమ్మిదిన ఆదివాసీ కవాతు, ఆదివాసీ మహాసభ నిర్వహిస్తామని, వచ్చే నెలలో భారీ బహిరంగ సభ నిర్వహించి ఎస్‌టి డిక్లరేషన్ ప్రకటిస్తామని వెల్లడించారు.

బిఆర్‌ఎస్ కార్యకర్తగా మెట్రో ఎండి ఎన్‌విఎస్ రెడ్డి

- మహేష్ కుమార్ గౌడ్ విమర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల సోమ్ముతో జీతాలు తీసుకుంటున్న అధికారుల్లో కొంతమంది బిఆర్‌ఎస్ కార్యకర్తలుగా మాట్లాడుతున్నారని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పుణ్యమా అని మెట్రోరైలు ఎండి అయిన ఎన్‌విఎస్ రెడ్డి బిఆర్‌ఎస్ కార్యకర్తగా మారాడని ఆరోపించారు. మంగళవారం మహేష్‌కుమార్ గౌడ్ ఇక్కడ విలేకరులతో మాట్లాడారు.దివంగత సిఎం వైఎస్సార్ హయాంలోనే మెట్రో రైలు 70 శాతం పనులు పూర్తయ్యాయని గుర్తుచేశారు. మూడు దశల్లో మెట్రో విస్తరిస్తామని చెబుతున్న ప్రభుత్వం నిధులు ఎక్కడ నుంచి తెస్తారో చెప్పడం లేదన్నారు. ఓ వైపు భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే, హెల్త్ డైరెక్టర్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రుణమాఫీకి నిధులు లేవు, రైతుబంధు పూర్తిగా అమలుకావడంలేదు, ఉద్యోగులకు సక్రమంగా జీతాలు అందటం లేదు...అయినా, ప్రభుత్వ పెద్దలు ఆచరణ సాధ్యంకానీ హామీలివ్వడం హాస్యాస్పదమన్నారు. హైదరాబాద్ ప్రజల ఓట్ల కోసమే మెట్రో పొడగిస్తామని ప్రభుత్వం ప్రకటన చేసిందని ఆయన పేర్కొన్నారు.